# వేదవ్యాసుడు

శ్రీమతి గోపిక ప్రసాద్

ఎమెస్కో

# వేదవ్యాసుడు

శ్రీకృష్ణ పరమాత్మ గీతలో ఉపదేశించిన తత్త్వజ్ఞానాన్ని 'ఆధ్యాత్మవిద్యాసారం' గా అభివర్ణించారు.

అసలు తత్త్వజ్ఞానం అన్ని విద్యలకూ రాజు వంటిది. ఇతర విద్యలన్నీ శరీరంలో అంగాలైతే, ఆధ్యాత్మ విద్య శరీరం వంటిది.

ఇతర విద్యలు పూసలయితే, వాటినన్నిటినీ కూర్చిన దారం ఈ తత్త్వజ్ఞానం.

అంత్యకాలం సమీపిస్తున్న కొద్దీ ఇతర విద్యలు మనిషికి దూరమవుతాయి. కాని ఆత్మవిద్య దగ్గరవుతూ ఉంటుంది.

ఇంతెందుకు? విద్యలు చెట్టు కొమ్మలయితే, ఆత్మవిద్య వేరు వంటిది.

అసలు ఇతర విద్యలన్నీ ఇంద్రియాలయితే, ఈ విద్య ఊపిరి వంటిది... ఒక్కవాక్యంలో చెప్పాలంటే– ఈ ఆత్మవిద్య ఫలం అనంతమైనది.

## న హి జ్ఞానేన సదృశమ్

ఏదైనా సాధన చేయాలంటే అవసరమైంది జ్ఞానం. జ్ఞానం విద్య వలననే లభిస్తుంది. లౌకిక సాధనలలో విద్యయొక్క గొప్పదనం అసాధారణమైనది. రకరకాల కారణాల వల్ల జీవనవ్యవస్థ అనూహ్యమైన రీతిలో మార్పుచెందుతూ వచ్చింది. వైజ్ఞానిక ప్రగతి మూలంగా వసతి, వాహనాలు, వస్త్రాలు, యంత్రాలు, తంత్రాలు మొదలైన విభాగాలలో నూతన తంత్రాలు ఆవిష్కృతమవుతూ వచ్చాయి.

విజ్ఞాన ప్రగతి వల్ల లభించేటటువంటి సదుపాయాలు అపూర్వమైనవి. అయితే అవన్నీ బాహ్యసౌలభ్యాలు మాత్రమే. అలాంటివి ఎన్ని వున్నా అవి

అంతరంగ సుఖశాంతుల్ని ఇవ్వలేవు. నిజానికి అంతరంగంలో సుఖశాంతులు అవసరం లేనిదెవరికి? అయితే ఈ లౌకికవిద్యలు మనిషి అంతరంగంలోని అభిలాషను తీర్చగలుగుతున్నాయా? నిస్సందేహంగా లేవు.

## 'ఆధ్యాత్మ విద్యా విద్యానాం'

సైన్సు ఆగిపోయిన చోట వేదాంతం (ఆధ్యాత్మిక విద్య) మొదలవుతుందని ఒక నానుడి. మరో రకంగా చెప్పాలంటే ఆధ్యాత్మవిద్య మనిషికి ఆహారంలాంటిది. బంగారం, వెండి ఆభరణాలు ఎంత ఖరీదయినవయినా అవి దాహం తీర్చలేవు, ఆకలి తీర్చలేవు. అసలు మనిషి మౌలిక అవసరాలని అవి తీర్చలేవు. అంటే, మనిషి అస్తిత్వానికి మూలభూత సాధనాలుగా ఏ బాహ్యవస్తువులు నిలబడలేవు.

ఇంతటి మహోన్నతమైన తత్త్వజ్ఞాన స్వరూపం గురించి అతి ఖచ్చితమైన వివరణలను వేదాలు, ఉపనిషత్తులు సమగ్రంగా ఇచ్చాయి. ఇవన్నీ అపౌరుషేయాలు. ఋషులు, మునుల తపఃసిద్ధి ఫలంగా గోచరించే తమను ఆశ్రయించిన జిజ్ఞాసువులకు ఆధ్యాత్మజ్ఞానాన్ని పరిపూర్ణంగా ఇచ్చాయి.

ఋషులు, మునుల మార్గదర్శనంతో రాజులు, మహారాజులు కూడా వాటిని అర్థం చేసుకుని తమ పరిపాలనలో వాటిని క్రోడీకరించడంతో ఆధ్యాత్మవిద్య సామాన్య ప్రజలకు కూడా అర్థమవుతూ వచ్చింది. ఆధ్యాత్మిక అనుసంధానంలో లౌకికబ్రతుకులు సాగించి ఇహపరలోకాలలో అందరూ సుఖశాంతులు పొందడం సాధ్యమయింది.

ఆ రకంగా అన్ని విద్యల్లోకీ ఆధ్యాత్మవిద్య మాత్రమే కీలకమయిందై సగౌరవంగా సార్వభౌమస్థానాన్ని పొందింది.

...ఇదంతా కృతయుగంలో మాట.

ఆ యుగాంతం వరకూ తత్త్వజ్ఞానమనే సూర్యుడు తన తేజస్సుతో వెలుగుతూ వచ్చాడు. తరువాత త్రేతాయుగం వచ్చింది. ఈ యుగంలోనే రోజులు గడుస్తున్న కొద్దీ తత్త్వజ్ఞానానికి మాలిన్యం మరకలు అంటుకున్నాయి. అవి అంచెలంచెలుగా విజృంభించి రావణాసురుడి వంటి రాక్షసప్రవృత్తి, స్వార్థ లాలసతో కూడిన ప్రజల్ని